# పులినీడ

ఊరికి పొలిమేరల్లో ఒక కొండసీమ వుంది. చిన్న చిన్న పొదలున్నా, మొక్కలూ కూడా మొలిచాయి. అక్కడి వాతావరణం ప్రశాంతంగా వుంది. ఆ ప్రదేశం కొండ కాదు, గుట్ట కాదు. ఒక మెట్టలా ఎత్తుగా వుంది. అక్కడ ఒక పెద్ద మర్రి చెట్టు చాలా ఊడలు దిగి విశాలంగా ఆక్రమించుకొని వుంది! అక్కడ ఒక మందిరమా? మసీదా? చర్చా? అనిపించే భవనం ఒకటి వుంది!

ఆ వూరికి అంత దూరంలో ఏకాంతంగా వున్నా అది ఆ వూరి వారికేగాక, ఆ జిల్లా వారికి, యితర జిల్లాల వారికే కాకుండా, దేశం మొత్తం మీద అందరికీ పరిచయం అయినదే. వచ్చీ పోయే వారి దరి ఎప్పుడూ అలికిడిగానే వుంటుంది. అది అక్కడ వుండే బాబాగారి మహాత్మ్యమే. ఆయన పేరు ప్రఖ్యాతులూ, మహిమలూ ఆ వూరిలో కంటే పై వూళ్ళలోనే ఎక్కువ ప్రచారంలో ఉంటాయి. అందరికీ అది ఒక యాత్రా స్థలం. ఎన్నాళ్ళ నుండో బాబాగారి మహాత్మ్యాలు వింటున్నా, యిక్కడికి రావాలని అనుకుంటున్నా యిప్పటికి నెరవేరింది!

ఆనాడు లక్ష్మివారం! అక్కడ అడుగు పెట్టగానే మాకు చాలా ఆశ్చర్యం కలగడమే కాకుండా ఒక విధమయిన ఆకర్షణకు లోనవుతున్నట్టు అనిపించిందంటే అందుకు కారణం అక్కడ అన్ని దేశాల వారూ, అన్ని జాతుల వారూ అన్ని భాషల వారూ, అన్ని మతాలవారూ, చిన్న వాళ్లూ, పెద్ద వాళ్లూ, వృద్ధులూ, స్త్రీలు, పురుషులూ అందరూ కలిసి మెలిసి వున్నట్టనిపించారు, ఆ మత సహనం, ఐక్యమత్యం అపూర్వమనిపించింది.

ఆ మర్రి చెట్టు చేరగానే దేముడి ముందు ఉత్సవ విగ్రహంలా ఆ చెట్టు క్రింద ఓ ముసలిది ఎదురయింది. చేతు వ్రేళ్లకి తుమ్మ జిగురు వ్రాసినట్టుంది. ఆమె జుట్టు. ఆమె చుట్టూరా బొమ్మరింటికి పేర్చినట్టు రాళ్లూ, యిటుకలూ, పేర్చి వున్నాయి. వాటికి, పసుపూ, కుంకం బొట్లు పెట్టి వున్నాయి. కొన్ని కర్ర బొమ్మలకు వస్త్రాలు కట్టి వున్నాయి, ఆవిడ అక్కడ మఠం వేసుకు కూర్చొని పూనకం వచ్చినట్టు వూగుతూ -

''బాబా గారిని దర్శించుకోండి, ఉపదేశం పొందండి. మీ కోర్కెలు తీర్చుకోండి'' అని ఆవేశంగా అంటూంది.

జనం చుట్టూరా మూగి చోద్యం చూస్తున్నారు! ఆ చెట్లక్రిందా, పరిసరాల్లోనూ, చాలా మంది చేరి వున్నారు! బహుశా బాబాగారి దర్శనానికే అయి వుంటుంది. ఆ చుట్టు ప్రక్కల, పళ్ల దుకాణాలు, కొబ్బరి, ఊదొత్తుల, దుకాణాలూ నాలుగయిదు వున్నాయి -

అక్కడకు వచ్చిన ప్రతి ఒక్కడూ, కొబ్బరి కాయలూ, పూవులూ, అవీ కొంటునే వున్నారు చిల్లర వ్యాపారం చాల జోరుగా జరుగుతూంది.

అక్కడి పరిసరాలను పరిచయం చేసుకుందికి ఒక ఘంట పట్టింది. అంతలో కొందరు ''బాబాగారు వచ్చేరు! బాబాగారు వచ్చేరు!'' అని ఉత్సాహంగా అనడం, అక్కడి జనం అంతా కోలాహలంగా తిరగడం కనిపించింది. కాని బాబాగారు ఎక్కడా కనబడలేదు.

మాలో ఒకడు వుండబట్టలేక ''ఏరి? బాబాగారు?'' అని అడిగాడు.

''బాగుందయ్యా! అందరి దగ్గిరకీ వచ్చి... ఓహో! అని పలకరిస్తారనుకున్నావా? అదుగో ఆ మందిరంలో ఒక అరఘంటసేపు అందరికీ దర్శనం యిస్తారు'' ఒక్కొక్కరూ వెళ్లాలి! అదృష్టవంతులై వుండాలి - ఏకాంతంగా ఉపదేశిస్తారు!'' అని కొంచం చిరాకుగానే జవాబిచ్చాడు - బాబాగారి శిష్యకోటిలో ఒకడు.

సరే అని మేమూ ఆ మూకలో కలిసేం. మా వంతు వచ్చేవరకూ నిలబడి ద్వారంలోంచి వెళ్ళిపోయినాం. మా వాలకం ఆ ద్వారం దగ్గిర వున్న కాపలా వాడు కనిపెట్టి -

''ఏమయ్యా వుత్తి చేతులూపుగుంటూ వెళుతున్నారు! పది రూపాయల డబ్బులు లేకపోయినాయా! కొబ్బరికాయ, పువ్వులు, ఊదొత్తులు కొని దక్షిణ యివ్వడానికి? ''వెళ్లండి, వెళ్ల తీసుకుని రండి!'' అని గసిరి పొమ్మన్నాడు.

''అవి లేకపోతే దర్శనం కాదా?'' అని అడిగేం.

అతడు ఎగాదిగా చూసి బాబాగారి దర్శనం కావాలంటే వెళ్లి తీసుకురండి. వెళ్లండి. తక్కినవాళ్ళకి ఆలస్యం అయిపోతున్నది!'' అని యివతలకు నెట్టేసేడు.

అవి పట్టుగు మళ్లీ వెళ్ళడమా? మానడమా? అని మాలో మేము అనుకుంటూండగా - మమ్మల్ని రాసుగుంటూ, ఆయాసపడుతూ ఒక వ్యక్తి అతని వెనకాల ఆయన భార్య కాబోలు ఒక లావుపాటి ఆవిడ వెళ్లిపోతున్నారు. కొంత మంది జనం ఆయన వెనకాల పడి నడుస్తూ ఎన్నో ప్రశ్నలు వేస్తున్నారు. ''దర్శనం అయిందా?'' అని కొందరు, ''ఏం సెలవిచ్చారు?'' అని కొందరూ ''ప్రసాదం యిచ్చారా?'' అని మరి కొందరూ యిలా ఎవరికి తోచినట్టు వారు అడుగుతున్నారు.

''ఆ అయింది! సాయంత్రం ఆరుగంటలకి మా ఆవిడని తిరిగి దర్శనం చేసుకోమన్నారు. ఏదో మంత్రించి ప్రసాదం యిస్తామన్నారు'' అని జవాబు చెబుతూ వెళ్లిపోయాడు.

''చాలా అదృష్టవంతులు!'' అని చాలా మంది అన్నారు

''మహానుభావుడు! ఏం తేజస్సు! చూసి తీరవలసిందే! మన వయిపు అతను దృష్టి సారిస్తే చాలు పాపాలు పోతాయి.'' అని అంటూ వెళిపోతున్న ఆ వ్యక్తి వెంట మేమూ పడి -

''దర్శనం చేసుకున్నట్టున్నారు.... ఏమిటి! విశేషం?'' చెప్పండి అని అడిగాం.

''అవునండి. వారం రోజుల బట్టి ప్రయత్నిస్తున్నాం. ఈ రోజు మా పుణ్యం ఫలించింది. చక్కగా దర్శనం అయింది. మా కోర్కె తీరుతుందన్నారు''

''మంచిది! అయితే యీ కొబ్బరి కాయలూ, దక్షిణా యివన్నీ ఏమిటండీ! ఆయన స్వయంగా

తీసుకుంటారా ?''

''ఏదేమిటండీ! అలా అడుగుతున్నారు? భగవంతుని దగ్గరకు వెళితే యివన్నీ తీసుకు వెళ్ళమా? ఆ భగవంతుడు స్వయంగా తీసుకుంటున్నాడా ?'' అని ఎదురు ప్రశ్న వేశాడు.

''మీరు చెప్పింది సరే కానండి! కాని. యిష్టమయిన వాళ్ళూ, యిచ్చుకో గలవాళ్ళూ యిస్తారు. లేనివాళ్ళని నిర్బంధించకూడదు కదా ?''

''పూర్వం లేదుగానండి. కొన్నాళ్ళనుండి యీ నియమం పెట్టేరు! మహానుభావుల వుద్దేశ్యం ఏమిటో మరి! యీ జనసమ్మర్దంతో సంబంధం వదుల్చుగొని - నిశ్చింతగా, ప్రశాంతంగా తపస్సు చేసుకోవాలంటే యీ జనం రోజు రోజుకీ ఎక్కువయిపోతున్నారని - యీ విధంగా ఏదో నిర్బంధం పెడితే కొంత మంది వెనకాడతారన్న ఆలోచనతోనే యిలా పెట్టేరని కొందరంటున్నారు.

తనను సేవించుకొందుకు వచ్చిన యాత్రికుల సౌకర్యార్థం, వసతులూ, సదుపాయాలూ, సమకూర్చడం కోసం యీ మూలంగా ధనం సేకరిస్తున్నారని మరి కొందరూ అనుకుంటున్నారు''

''అయితే యీ వచ్చిన కొబ్బరికాయలూ, ఊదొత్తులూ, యిలాటివన్నీ ఏం చేస్తారు. లెక్కకు మిక్కిలి వస్తాయే!'' అని మేం అంటున్నది వినిపించుకోకుండా తిరిగి ఆయనే -

''బాబాగారు కేవలం దైవాంశసంభూతుడు! యితనికి అందరూ సమానమే! మతం, జాతి, భాష, కులం, దేశం, యీ విచక్షణ లేదు. యిక్కడ అందరూ తారతమ్యం లేకుండా భేదభావాలు లేకుండా వుంటున్నారు. అందరూ అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్లే. అందరినీ ఒక్కలాగే భావించి, ఆదరించి, కోరికలు తీర్చే మహాత్ముడు'' అని ఉద్వేగంతో అంటూంటే.

''కోరికలేమైనా తీరుస్తారా!'' అని అడిగాము.

''ఆయన శక్తి, యుక్తి స్వరూపుడు! ఆ శక్తికి వీలుకానిది ఏది? తీరని కోర్కెలని కూడా తీర్చే భగవంతుడు. అంతెందుకు? సంతాన విహీనులకు కూడా సంతాన భాగ్యం కలుగజేస్తాడు. అంత మహిమాన్వితుడు, మహా తేజశ్వి. అతని చల్లని చూపు చాలు. ఆ ప్రభావం ఎంతటి గొడ్రాలి మీదనయినా పనిచేస్తుంది. యీ విషయంలో మాత్రం యీతని ప్రతిభ అమోఘం. ఎవరికోగాని ఫలితం దక్కక పోవడం అంటూ లేదు.

ఎంతో మంది పిల్లలు లేని నిర్భాగ్యులు యీయన మహాత్మ్యం వలన సంతానవతులయ్యారు. యీయన పేరు ఆశేతు హిమాచల పర్యంతం ఆబాలగోపాలానికీ తెలుసు. యిదిగో నా భార్యని కూడా అందుకే తీసుకు వచ్చేను. నా అదృష్టం ఫలించినట్టే. ఆయన మళ్ళీ దర్శనానికి రమ్మన్నారు... అని యింకా ఏమేమో చెబుతూంటే యింక విననవసరం లేదని మేమే తప్పుగున్నాం.

ఇంత దూరం వచ్చి ఆయనను చూడడం అవలేదు కదా అని విచారించాం. వూరికనే చూసి రాడానికి నలభై రూపాయలూ, దక్షిణలూ, యివ్వడం అనవసరమనిపించింది. అందువల్ల యింటి ముఖం పట్టేం.

అప్పటికే కొంచం చీకటి పడింది. మసక మసకగా వుంది. అక్కడ యింకా మిగిలిన వారందరూ ''రేపు దర్శనం చేసుకో వచ్చు'' అనుకుంటూ వెళ్ళిపోతున్నారు. చాలా మంది అక్కడే ఆ రాత్రి

వుండడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అప్పటికి అంత మాటు మణిగింది.

మందిరం వెనుక నుండి కొందరు తట్టలతో ఏవో సామాన్లు మోసుకు వస్తున్నట్లుంటే ప్రక్కన నిలబడి చూస్తున్నాం. వాళ్లు గబగబా అక్కడున్న దుకాణాల దగ్గరకు పోయి ఆ తట్టలు యిస్తున్నారు.

భక్తులు సమర్పించుకొన్న కానుకలే యివి. తిరిగి రేపు అమ్మకానికి సిద్ధమవుతున్నాయని అర్థం చేసుకున్నాం.

చెట్టుక్రింద ముసలిది తీరుబాయిగా దుప్పటి వెచ్చగా కప్పుకు కూర్చుని [illegible], ప్రసాదం ఫలహారం చేస్తోంది!

అదంత చూస్తు పరి పరి విధాల అనుకుంటూ విస్తుగా యిళ్లకి చేరుకున్నాం.

నలభై రూపాయల కోసం ఆలోచించి బాబాగారిని చూడకుండా వచ్చేసామే అన్న బాధ మనసులో వేధిస్తూనే వుంది. ఎలాగయినా అతన్ని చూసి అనుమాన నివృత్తి చేసుకోవాలని - ఆ మర్నాడు మళ్లీ బయలుదేరాం.

మేం వెళ్లేసరికి అక్కడ కొన్ని గుర్రపు బళ్లు ఆగి వున్నాయి, నిన్నటిలా జనం ఎక్కువగా లేరు, లోపలనుండి వాద్య సంగీతం, స్త్రీల పాటలూ వినుల విందుగా వినబడుతున్నాయి. అక్కడ కాపలా వాళ్లు ఎవరూ లేకపోడం చేత మేము ద్వారం దాటి లోపలకు వెళ్లిపోయాం.

లోపల పెద్దహాలు లా వుంది. అడ్డంగా పొడవాటి సన్నని తెల్లని తెరలు కట్టి వున్నాయి. లోపల తక్కువ దీపపు కాంతుల్లో, లీలగా మనుషులు కూర్చుని పాడుతున్నట్టు ఒకరిద్దరు నాట్యం చేస్తున్నట్టు తెరల లోంచి కనబడుతూంది. ఏదో సినిమాలో సీనులా అనిపించింది.

ఇంతలో ఎవరో మా రాకను గమనించి గబగబా పరుగెట్టుకుంటూ వచ్చి - ''ఎవరు మీరు ? ఎవరినీ అడగకుండా ఏమిటిలా వచ్చేస్తున్నారు ?'' అని అడ్డుకున్నాడు.

''మేము బాబాగారి దర్శనం కోసం వచ్చాం !'' అన్నాం.

''ఇవాళ రాకూడదని తెలియదా ? వెళ్ళండి !'' అన్నాడు.

''ఎందుకని యివాళ రాకూడదు! మేము చాల దూరం నుండి వచ్చాం!''

''ఇవాళ శుక్రవారం, యీ రోజు కేవలం ప్రత్యేక ఆహ్వానితులకి తప్ప యితరులకు దర్శనం రోజుకాదు. మీరు రేపు దయచేయండి ! '' అని అన్నాడు.

''మేము, యీ వూరి వాళ్లం కాదు ! ఎంతో శ్రమతో వచ్చాం. ఒకరోజు వుండిపోవాలంటే ఆలోచించండి ! ఎంత యిబ్బంది అవుతుందో . ఎలాగయినా దర్శనం చేయించినట్టయితే మీ మేలు మరువలేము !'' అని బ్రతిమాలుతూ అన్నాం.

క్షమించండి ! యీ రోజును ప్రత్యేక వ్యక్తుల కోసం కేటాయించారు బాబాగారు ముందుగా వారి అనుమతి పొందనిదే వీలుకాదు. ఈరోజు మరి లాభం లేదు. దయచేసి మరో రోజు రండి. '' అని మమ్మల్ని యివతలకు తీసుకవచ్చి తను మరి వినిపించుకోకుండా వెళ్లిపోయాడు.

రెండోసారి వచ్చినా యీ అవాంతరం ఏమిటీ కర్మ! అని అనుకుంటూ ఆ మఠానికి కొంచం దూరంగా కోనేరు వుంటే అక్కడ కాస్సేపు కూర్చుందామని వెళ్లేం ! ఆ చెరువు చుట్టూ పెద్ద పెద్ద

బండరాళ్ళూ, గుబురుగా పెరిగిన చెట్లూ దట్టంగా వున్నాయి అక్కడ చాలా ఏకాంతంగా వుంది, వచ్చే వాళ్లుగాని, వెళ్లే వాళ్లుగాని ఒకరికొకరు కనబడరు.

మేం నలుగురం అలా పోయి ఒక రాయి మీద కూర్చున్నాం. అంతలో ఆ రాయికి వెనక ప్రక్క నుండి ఒక స్త్రీ, వొక పురుషుని మాటలు వినబడుతున్నాయి.

'' ఇక పై నేనిక్కడికి యిలా రావడం కుదరదు. నన్ను మరచిపోండి '' అన్నది స్త్రీ.

'' ఏం అనుమానం ఏమయినా వచ్చిందా?'' అని పురుషుడు.

'' అదేంకాదుగాని'' కోరిక తీరిందికదా! మరి రావడం బావుండదు!''

'' అంతేలే'' యిలాటి చాటు మాటు పనులు తెలిసిపోతాయి తర్వాత నీకు ప్రమాదం! అయినా మీ వాళ్లు ఏమను కుంటున్నారు!''..,

''అంతా బాబాగారి మహాత్యమే అనుకుంటున్నారు. ఆయన పేరే పెడతారంట!''

'' అలా మీ రొక్కరే అనుకున్నావా?''

'' ఆహా! అయితే నీలాటి వాళ్లెంత మంది వున్నారు?

''గదికొక్కడు!'' అని నవ్వేడు.

'' అయితే అందరూ యిలాటి వరప్రసాదులే నన్నమాట!''

'' వెర్రిదానా ?'' మీలాటి వారందరూ మూర్ఖులు! గొర్రెలు! లేకపోతే ఎవరిలోపం వారు తెలుసుకొని దానికి కారణం కనుక్కోవాలిగాని యిలా పిల్లల కోసం పైవాళ్ళ దగ్గరకు రావడం ఏమిటి? సృష్టి మనకోసం. దేవుడు మనలను సృష్టి కోసమే సృజించినపుడు.., మనలో లోపం వున్నపుడు, దానిని సరిచేసుకొనేందుకు ప్రయత్నించాలిగాని యిది మార్గం కాదు''

'' ఇన్నీ తెలిసి యీ పాపమేదో జరుగక ముందే యీ విషయం ఎందుకు చెప్పలేదు?''

' బాగుంది నీప్రశ్న.. యిదొక బ్రతుకు తెరువు!''... కష్టం లేకండా కూడు దొరికితే కాదన్న వాడుంటాడా ?'' ... మాకేం పోయింది! నెలనెలకూ యింతని యిస్తూంటారు! తిండీ, బట్టా, అన్ని సౌఖ్యాలూ యిక్కడే, కుటుంబ భారం అసలే లేదు.. తేనె టీగల్లో పోతు టీగల్లాటి వారమన్నమాట!''

'' చాలా బావుంది! మీ పని! ఎంత అదృష్టవంతులు!''

'' మరే మనుకున్నావు ? బాబాగారి శిష్యులం... మాది పరోపకారం!''

'' అయితే యిదంతా బాబాగారి పర్యవేక్షణ లోనే జరుగుతున్న వ్యవహారమే నన్నమాట!''

''ఇంత వరకూ మరినే చెబుతున్న దేమిటి ?'' ఆశీర్వచనాలకు, మంత్రాలకూ బిడ్డలు పుడతారా?... బాబాగారు.. యిలా చేయకపోతే ఆయనకు మహాత్యాలు లేవంటారు! ఆయన మనుగడకు ముప్పురాదా?''

'' బావుంది! తేలుకుట్టిన దొంగల్లా పైకి చెప్పుకోలేని అవస్థ యిది... '' చాలా ఆలశ్యం అయింది... యింకనే వెళతా...''

'' సరే! నాకూ అవతల పని వుంది! వెళ్లిరా!''

"ఏమిటా పని?"

"మరింక మాకేం పనులుంటాయి. కొత్తగా నిన్న ఒక పిల్ల వచ్చింది. ఆమె కొంచెం అల్లరి చేస్తోంది. నయాన్న లొంగలేదు.. బలవంతం చేస్తే గుట్టు రట్టవుతుందేమోనని భయం! కుసుమమ్మ నడిగి.. మందు తేవాలి. దీనితో లొంగి తీరుతుంది లే..."

"మందులతో కూడానా?"

"అన్ని రకాల వుపాయాలూ చూడక తప్పదు" ఎప్పుడయినా యీ వూరు వస్తే... యిటు రావడం మరచిపోకు.. వెళ్లిరా!"

ఇంక ఆ తర్వాత మాటలు వినబడలేదు... వాళ్లువెళ్లి పోయివుంటారనుకున్నాం... ఆ సంభాషణ అంతా విని మేము కొయ్యబారి పోయాం! ఈ బాబాగారి సంగతి అంత అప్పుడితో బహిర్గతమయి నిశ్చేష్టులమయినాం. ఎన్నాళ్ల నుండి యిలా జరుగుతూందో? యింకెన్నాళ్లు యిలా సాగుతుందో... యీ అక్రమాలు బయట పడే మార్గం ఏదైనా వుందా? అని అనుకుంటూ అప్పటికే పొద్దు పోతుండం వల్ల యిళ్లకు బయలు దేరాం.

ఈ విధంగా మోసపోయి, తీరని కోర్కెలను అణచుకోలేక మరో దారి లేక, సంఘంలో ఎత్తి పొడుపులను భరించలేక, మంచో, చెడో, యీ విధంగానయినా లోకం నోరు మూయగలిగితే చాలుననే భ్రమతో యీ బాబాగారిని ఆశ్రయిస్తున్నారు. ఏ బలహీనతో వారిని లొంగదీసుకుని యీ అవినీతికి ప్రోత్సాహమిస్తూన్నది.

ఈ రహస్యాన్ని భర్తలకీ, లోకానికి తెలియకుండా పాపఫలాన్ని మోస్తూ తమ వ్యక్తిత్వానికేగాక, సంఘానికి, జాతికీ, దేశానికీ కూడా కళంకం తెస్తున్నారు.

అని అనుకుంటూ వేదనాభరితమయిన మనస్సులతో యిళ్లకు చేరుకున్నాం... ఆ రాత్రల్లా.. ఆ వేదనతో.. యివే ఆలోచనలతో నిద్ర పట్టలేదు.

ఆరోజే ఒక వుత్తరం వచ్చింది!

అది మా మేనమామ దగ్గర్నుండి!!

ఎంత ఆత్రుతతో చదివేనో అంత క్రుంగిపోయాను!

అయిదేళ్ళయి పెళ్లి అయినా సంతానం కలగని మా మేనమామ కూతురు సుందరిని, పద్దెనిమిదేళ్లు వచ్చినా రజస్వల కాని మరో బంధువుల పిల్ల పద్మని, బాబాగారి దర్శనార్థం తీసుకు వస్తున్నట్టు. స్టేషనికి రావలసిందని ఈవుత్తరం. ఇహ ఏమిటి చేయడం?.. చూస్తూ చూస్తూ నా సమక్షాన్నే... నావాళ్లే యిలా మూర్ఖంగా మోసపోతూ వుంటే ఎలా సహించడం? వాళ్లకి యీ నిజాన్ని చెప్పి ఎలా రక్షించడం?

చెబితే వాళ్లు నమ్ముతారా? అన్న ప్రకారం వాళ్లు రానే వచ్చారు.

సుందరిని బాగా తెలుసు కాబట్టి రాగానే కుశల ప్రశ్నలు వేసుకున్నాం. కాని ఆ అమ్మాయి పద్మ మాత్రం లోలోపల ఏం అనుకుంటూందో గాని వచ్చిన దగ్గర్నుండి వంచిన తల ఎత్తకుండా సిగ్గుతో ముడుచుకు పోతూంది. సాధ్యమయినంత మట్టుగు... దృష్టిలో పడకుండా తప్పించుకు

జరుగుతున్నది.

ప్రకృతిలో యిలాంటి అరుదయిన విషయాలు భయపెట్టడానికి తప్పితే, మరేమీ విపరీతమయినవి కావు. ఆమె బయటకు చెప్పలేని ఆవేదనలో కుంగిపోతున్నదనిపించింది. ఆమెలో ఆ అయిష్టత కనబడుతూనే వుంది!

ఆమెను చూస్తే ఆమెలో దోషం వున్నట్లు కనబడలేదు సాధారణంగా సహజంగానే వుంది. కాస్త ఆలశ్యానికి ఎందుకింత గొడవపడుతున్నారు అనిపించింది. "అందుకు అందే వరకు పెట్టున ఎందుకు వుండనివ్వరు" అని అనుకున్నాను. ప్రకృతి బాధ్యతను ప్రకృతికే వదిలేయకుండా ఆమెని బలవంతం చేస్తున్నారు. ఆమెలో లేనిలోపాన్ని వుందని చెప్పి సిగ్గుపడేట్టు చేస్తున్నారు!

ఏమయితేనేం! వాళ్లు గుమ్మంలో కాలుపెట్టినదగ్గర్నుంచి బాబా బాబా!! '' అని ఒకటే స్మరణ చేస్తున్నారు.. వాళ్లతో నిజం ఎలా చెప్పడమా అని నేను సమయం కోసం చూస్తున్నాను?

''మామయ్యా.. మీరుకూడా యిలాటివి నమ్ముతున్నారా?. ఇదంతా మోసం! నా మాట విని వెళ్లకండి! .'' అని అన్నాను.

''నీకు నమ్మకం లేకపోతే.. సరే! యింతమంది, దేశం నలుమూలల నుండి వెర్రివాళ్లయి వస్తున్నారా! ఏపుట్టలో ఏ పాము వుందో. ఎవరికి తెలుసు!.. అలా అనడం తప్పు. మహాత్ములుంటారు.!'' అని అన్నాడు.

మేము, చూసినవి, జరిగినవి, అన్నివిశేషాలూ చెప్పాను. కాని వాళ్లు నా మాట వినలేదు. అన్నీ కిట్టని వాళ్లు కల్పించినవని కొట్టిపారేశాడు.

దేని మీదనయినా నమ్మకం లేకపోతే ప్రతి విషయం విరుద్ధంగానే కనబడుతుంది అని అంటూనే

''సరే . యింతదూరం ఎలాగూ వచ్చాం కదా! వృధాగా తిరిగి వెళ్లి పోయే కన్నా అదేదో చూసే పోతాం. ఇందులో పోయేదేముంది! మన జాగ్రత్తలో మనం వుంటే ఏమవుతుంది?'' అని వెళ్లడానికి నిశ్చయించుకున్నాడు.

అనుకున్నట్టు వుదయాన్నే బయలుదేరారు, ఎవరు అన్నీ వీళ్లకెలా తెలిసాయో ఏమిటో! కొబ్బరికాయలూ, పళ్లూ, ఊదొత్తులూ అన్నీ ముందే జాగ్రత్త చేసుకుని వెళ్లేరు! నన్ను కూడా రమ్మని పిలిచినా గడచిన అనుభవాలను తలుచుకుని వెళ్లలేదు. తిరిగి వచ్చి వాళ్లేం చెబుతారో అని ఆందోళనలో వున్నాను.

మధ్యాహ్నం ఒంటిగంటకి మామయ్య ఒక్కడే వచ్చాడు. అది చూసి నేను అసంతృప్తితో.

''వాళ్లేరీ!'' అని అడిగాను. అది వినిపించుకోకుండా .

'' ఒరేయ్! నువ్వెప్పుడూ! ఒకళ్లని విమర్శించడం మానవు! కాని - ఓహో! హో! ఏ వాల్మీకి ఆశ్రమమో అనుకున్నా.. అక్కడ ప్రశాంత వాతావరణం అక్కడ వాళ్ల ప్రవర్తన... యిదంతా చూస్తూ వుంటే ఏనాడో పురాణకాలంలో ఆ మహాత్ముల ఆశ్రమాల్లో వున్నట్టు అనిపించింది!

బాబాగారిని నువ్వు చూడలేదు గాని... ఏం విగ్రహం! ... ఆ మూర్తిని వర్ణించగలమా?. అతనిని చూసే సరికే ఏదో మహత్తరమయిన తేజస్సు, ఆకర్షణ, మనలను వశపరచుకొన్నట్లు

అనిపిస్తుంది. మన మనస్సు మనకు తెలియకుండానే ఆయన మీద లగ్నం అయిపోతుంది. ఆక్షణమే సాష్టాంగపడి, మోకరించి వేడుకోవాలని అనిపిస్తుంది!.. నేను అబద్ధం చెప్పడంగాని, అతిశయోక్తిగా అనడంగాని కాదు ప్రత్యక్షంగా చూసి తీరాలి!.. సాయంత్రం నువ్వూరా! నేనన్నది నిజమో కాదో నీకే తెలుస్తుంది!'' అని చెప్పుకు పోతున్నాడు.

సరేలేగాని- వాళ్లేరీ?'' అని మళ్లీ అడిగేను.

'' వాళ్లని అక్కడే వుంచాను! బాబాగారి అనుగ్రహం అయింది! అని అన్నాడు అది విని - నేను గుప్పుమని పోయాను.

'' అదేమిటి? అక్కడెందుకున్నారు?... ఏం జరిగిందో మొదటి నుండి చెప్పు!'' అని ఆత్రుతతో అడిగాను.

'' మేము వెళ్లిన అరఘుంటకే బాబాగారు కటాక్షించారు అందరితో పాటు మేమూ దర్శనం చేసుకొని, అన్నీ వారి సన్నిధిలో విన్నవించాను. అది విని - '' యీ జనం అంతా దర్శనం చేసుకొని వెళ్లాక విరామ సమయంలో మళ్లీ రండి!'' అని సెలవిచ్చారు.

పరమానందంతో కొంతసేపు అక్కడ, వుండి పునర్దర్శనం చేసుగున్నాం!'' అప్పుడు చిరునవ్వు నవ్వుతూ నిమీలిత నేత్రాలతో సుందరిని, పద్మని, తలపై హస్త ముంచి ఆశీర్వదిస్తూ, వీరిని యీదినం యిక్కడ వుంచండి. మీ కోర్కెలు నెరవేరతాయి... అని అభయ హస్తం యిస్తూ అన్నారు.

అది విని '' ఆ భగవంతుడే స్వయంగా అంత వాత్సల్యంతో చెబుతూ వుంటే అంత కన్నా ఏం కావాలి? దేని కోసమయితే వచ్చేమో అది పూర్వజన్మ సుకృతం వల్ల నెరవేరబోతూ వుంటే యింక వేరే ఆలోచన ఎందుకు? యిలాటి మహనీయుల వద్ద ఒక్కరోజు ఏమిటి? జీవితాంతం వున్నా జన్మచరితార్థం అవుతుంది! అందుకని వాళ్లని అక్కడే వుంచి యిలా వచ్చేను! అని ఎంతో సంతోషంతో అన్నాడు.

అది విని నాగుండెల్లో పిడుగు పడి నట్లయింది. ఏమో చెబుదా మనుకున్నాను గాని నోట మాట రాలేదు. ఇంత చెప్పినా అఖరికి వాళ్లు బలి పశువులయి పోయారే అని అనుకుని- ''ఎంత పని చేశావు మామయ్యా!'' అని అన్నాను

'' ఇంకా నీకు నమ్మకం కుదరలేదా? అందికే నాతో కూడా రమ్మన్నాను! అని అమాయకంగా అన్నాడు.

'' మామయ్యా ! యిప్పటికయినా మించిపోయింది లేదు! నామాట విని వెంటనే వెళ్లి వాళ్లను తీసుకు వచ్చేద్దాం పద ! అనవసరమయిన చిక్కులో పడుతున్నావు: బాబా లేదు.. ఎవరూ లేరు! యీ మూఢ నమ్మకాన్ని వదులు!'' అని గట్టిగానే చెప్పేను.

'' అదుగో ఎంత మాట అనేసేవురా! మహాత్ములని అలాగంటే పాపం చుట్టుగుంటుంది! భగవంతుణ్ణి శరణు జొచ్చి మన బాధలను చెప్పుగొని నివృత్తి కోసం ప్రార్థించడం తప్పా !''

'' ఎంత మాత్రం తప్పులేదు!'' ఎవరు భగవంతుడు! యీ బాబానా! భగవంతుడనే వాడొక డున్నాడని తెలిసి ఆయననే శరణు వేడుకోకుండా యిలా మానవమాత్రులయిన వీరిని నమ్మడం

ఏమిటి! మీరినెందుకు ప్రార్థించడం? మీరు భగవంతుళ్లెలా అవుతారు?

'' నువ్వింకా చిన్నవాడివి! మనుషుల్లోనే అవతార పురుషులుంటారు... నేరుగా భగవంతుని చేరగలగడం మనలాటి సామాన్యులకు అయేపని కాదు. అలాటపుడు భగవత్స్వరూపులయిన యిలాటి కారణజన్ములే పామరులకు వెలుగు చూపెడతారు.. ప్రాప్త మున్న వారికి, అదృష్టవంతులకి, కోర్కెలు తీరుతాయి''.

'' ఇలా మాయలనీ, మంత్రాలనీ, వేషాలు వేసి, ఏవో కొన్ని మ్యాజిక్కులు చేసి, జనాలని ఆకర్షించి వంచించి బ్రతుకు తున్నారు, అవే మహాత్యాలని, వారు మహాత్ములని పొగిడి మీలాటి వాళ్లు మరింత ప్రోత్సాహం యిస్తున్నారు. అంతేగాని ఎంత మంది బాబాలు మోసగాళ్లని బయట పడిపోలేదు!''

''ఎవళ్లో ఒకరిద్దరు... అలాటి వారయితే బాబా లందర్నీ అలాటివారనే అనడం తప్పు!... సరే! ఎవరి నమ్మకాలు వారివి. యీ వస్తున్న జనం జరుగుతున్న ప్రచారం ... నిదర్శనాలూ యివన్నీ. అబద్ధం అంటావా? అందరూ తెలివి లేనివారే అంటావా?. ఏదయినా రహస్యం యిందులో వుంటే ఎన్నాళ్లని దాగుతుంది?''

'' ఎన్నాళ్లయినా సాగుతుంది! ఆపాపం బ్రద్దలయేవరకూ! ఆరోజు కూడా వస్తుంది! మూర్ఖంగా ప్రజలు నమ్మి కళ్లు మూసుగొని ఉన్నాళ్లు నడుస్తుంది! రోగికి పత్యం సహిస్తుందా? వీళ్ల మీద వుండే నమ్మకం ముందు మంచీ చెడూ ఆలోచించే విచక్షణా జ్ఞానం నసిస్తుంది! నీ యిష్టం!'' అని యిహ వాదించి అతనిని నమ్మించలేమని వూరుకున్నాను. అన్నీ తెలిసినా ఏమీ చేయ లేక పోతున్నానని, వారిని ఆపలేక పోతున్నానని బాధగా వుంది.

మూర్ఖత్వం, మూలాన అప్పుడే మూడొంతులు ఆశ సన్నగిలి పోయింది. చూస్తూ చూస్తూండగానే యిలాటి అక్రమం జరుగుతున్నా నివారించలేక పోతున్నాను. నిజం చెప్పినా వీళ్లకు బోధపడలేదు. జరిగే ఘోరాన్ని ఊహించలేక పోతున్నారు.

సాయంత్రం అయిదు గంటలకు యిద్దరమూ బయలుదేరేము. నాకిష్టం లేకపోయినా మామయ్య బలవంతం మీద వెళ్లక తప్పలేదు.

బాబాగారి మఠం యింకకొద్ది దూరంలో వుందనగానే - సుందరీ, పద్మా, యిద్దరూ గబగబా నడుచుగుంటూ వెనక్కి తిరిగి చూసుకుంటూ వచ్చేస్తున్నారు. వారిని చూసి మా మామయ్య ఆశ్చర్యపడుతూ.

'' ఏం వచ్చేస్తున్నారు? మేంవచ్చేవరకూ అక్కడే వుండ వలసింది! '' అని అడిగేడు. నేను మాత్రం వాళ్లలో కనబడుతున్న మార్పుని గమనిస్తున్నాను.

సుందరి మొహం కొంచం వాడినట్టు వున్నా అంతో యింతో ప్రపంచజ్ఞానం వున్నది కాబట్టి వస్తున్న దుఃఖాన్ని, భయాన్నీ లోలోపలే అణుచుకుందికి ప్రయత్నస్తుంది, కాని పద్మ మమ్మల్ని చూడగానే సిగ్గుతో తల దించేసుకుంది. మౌనంగా వుండిపోయింది. ఇద్దరి మొఖాలూ ఎర్రగా కంది పోయి వున్నాయి. లోలోపల భయంతో వణికి పోతున్నారు.

వాళ్ల ప్రవర్తన చూసి నేను అనుకున్నంత అయివుంటుందని గ్రహించాను.. కాని మామయ్యకు అర్థంకాక... అమాయకంగా -

'' ఏమయింది : ఏమిటలా వున్నారు? '' అని గాభరాగా అడిగేడు.

'' ఏం లేదు నాన్నా! అయిపోయింది! మరెందుకని వచ్చేస్తున్నాం..''

'' బాబాగారు ఏమన్నారు ?... ఏమయినా మంత్రించారా?''

'' అవన్నీ యింటి దగ్గర చెబుతాం .. పదండి నాన్నా ! '' అంది సుందరి !

'' ఒంటరిగా మీరిద్దరూ యిలా ఎవరితోడూ లేకుండా రావచ్చా, కొంచంసేపు మాకోసం చూడ లేకపోయినారా?''

'' తిన్నగా ఒకటే దారికద్దా ! మరెందుకక్కడ. వచ్చిన పని అయిపోయింది కదా. దారిలో మీరు కనబడతారు! అని అనుకుంటూ వచ్చేస్తున్నాం'' అని చెప్పింది సుందరి.

'' సరి ఏమిటయిందో చెప్పండి '' అని వాళ్లను వెనక్కు రమ్మని మఠం వయిపు నడవడం మొదలెట్టాడు.

'' అదేమిటి? నాన్నా మళ్లీ అక్కడికెందుకు ? '' అని వాళ్లిద్దరూ ఆగిపోయారు.

'' ఒకసారి నేను దర్శనం చేసుకుని సెలవు తీసుకునివస్తాను రండి యిట్టే వచ్చేద్దాం !'' అని అన్నాడు.

నాకు చాలా కోపం వచ్చింది..

''పదమామయ్యా! నీ చాదస్తం నీవూ ! వాళ్లపని అయిపోయింది. యింక నువ్వు వస్తావో లేదో అనే చూస్తారను కున్నావా?... తిన్నగా యింటికి పద .!'' అని నేను విసుగ్గా అన్నాను.

'' అవున్నాన్నా.. మరిమేం అక్కడికి రాం!'' అని యిద్దరూ అన్నాడు.

'' బావుందర్రా ! బావుంది మనపని అయిపోయింది కదా అని చెప్పకుండా వెళ్లి పోడమా ? అపరాధం కాదూ '' అని అనగానే - సుందరి-

'' నాన్నా నా మాట విని యింటికి పదండి ! మరి మీ నాన్నగారు రానక్కర్లేదని ఆయనే చెప్పేరు. మరి నువ్వు అక్కడికి వెళ్లనక్కర్లేదు. అతనిని కలుసుగునే అవుసరం కూడా లేదు!'' అని అన్నది.

'' బావుంటుందా ?'' అని యింకా నసుగుతూ వుంటే-

'' మహరాజులా వుంటుంది '' నువ్వు యింటికి వస్తే.. '' అని చెయ్యి పట్టుగు బలవంతాన్న నడిపించేను.

రెండు రిక్షాలు కట్టించుగొని యింటికి వచ్చేశాం.

ఆరాత్రి మా మామయ్య ఎంత అడిగినా మామ్మూలుగా బాబాగారు మంత్రించారని, మరేమీ ఫరవాలేదని, అన్నీ సవ్యంగా అవుతాయని. సుందరికి బిడ్డలు కలుగుతారని... పద్మ త్వరలో ఆరోగ్య వంతురాలు అవుతుందని... ఆశీర్వదించారని... యిలాగే... చెప్పేరుగాని... మరేమీ చెప్పలేదు.

నాకు మాత్రం వారు నిజం దాస్తున్నారని - ఏమయిందో తెలుసుకోవాలని వుంది! కాని..

ఆడవాళ్లని ఎలా అడగగలను ?...

మా మామయ్యకీ నాకూ నిద్రపట్టక ఏవో కబుర్లాడుతూ వున్నాం. వాళ్లు మాత్రం నిద్రపోతున్నారు... కొంచం మగత నిద్ర పడుతున్నట్లుంది. అంతలో

'' అబ్బా!... వదులు... ఫోవెధవా! ... ఎంత మోసం ...!'' అని ... సుందరి. పలవరిస్తూంది... అదివిని మామయ్య లేచి కూతురు దగ్గిరికి వెళ్లి లేపబోతున్నాడు...

'' ఏంనమ్మా.. ఏమిటయింది!. లే... తెలివి తెచ్చుకో...'' అని లేపుతున్నాడు.

'' ఏమిటయింది!.. పలవరించానా!... '' అని లేచింది సుందరి.

'' అవును... పలవరించావు !.... బాబాని వెధవా అని తిడుతున్నావు!'' అని అది అలా అనక పోయినా నేను అనాలని... అన్నాను. అసలు సంగతి తెలుసుకుందామని.

అలానేను అనగానే నావయిపు అందరూ వింతగా చూశారు. మామయ్య నావైపు కోపంతో చూసి తెల్లబోయి వూరుకున్నాడు.

'' బా.. బా.. నా ?... '' అని సందిగ్ధంగా వూరుకుంది. ఆమె!.

మామయ్య కిదంతా అయోమయంగా వుంది,

పద్మకి కూడా యీ సందడికి తెలివి వచ్చింది కాబోలు సర్దుకొని అటు వత్తిగిలి పడుక్కుంది.

'' ఏమిటమ్మా. ఎందుకలా కలవరిస్తున్నావు!... చెప్పు. భయంలేదు!'' అని మళ్లీ మామయ్య అన్నాడు.

'' ఏం లేదు నాన్నా... ఏదో కలవచ్చింది!... అంతే?'' అన్నది.

'' అవునవును. 'బాబా' కలలోకి వచ్చి వుంటాడు! అని మళ్లీ నిలదీసి పెద్ద మనస్తత్వవేత్తలా అడిగేను- మళ్లీనేను యిలా అడిగే సరికి మామాయ్య కోపం యింక ఆపుకోలేకపోయాడు.

'' అదేమిట్రా ప్రతిదానికీ బాబా వూసే ఎత్తుతావు?... ఆయనేం చేశారు!.. యింటువంటి వేవీ రాకుండా వుండడానికే కదా... ఆయన మంత్రించేదీ! అని కసిరేడు.

అయినా నేను ఊరుకోలేదు.

'' కాదు! మామయ్యా! కాదు... యీ బాబా మంచి వాడు కాదు! అదంతా మోసం!... నే చెపుతున్నది నిజం... కావలిస్తే సుందరిని నిజం చెప్పమను... జరిగినదేదో!...'' అని గట్టిగా అన్నాను.

'' అవును నాన్నా.. బాబా...మంచివాడు కాదు : వుత్తి మోసకారి! అక్కడ వాళ్లందరూ... మోసగాళ్లే! '' అని నసుగుతూ చెప్పింది...

అది విని నిలువునా నీరయిపోయాడు... మామయ్య...

'' ఏం చేశాడేమిటి?'' అని ఉద్రేకంగా అన్నాడు...

'' నే చెప్పలేను... నాన్నా... అంటూ... ఏడవడం మొదలెట్టింది.

'' ఫరవాలేదమ్మా.. చెప్పు... నీకేం భయంలేదు... వూరుకో... అంత కూడనిపని ఏమయినా జరిగిందా ? వాళ్లకు తగిన బుద్ధి చెబుతాను అని '' సుందరిని.. ఓదారుస్తూ... ధైర్యం చెబుతూ... అడిగేడు...

అది విని.. సుందరి కాస్త కుదుట పడి.

"..నువ్వు వెళ్ళిన తర్వాత... ఆ బాబా నన్ను అక్కడే వుండమని.. పద్మని మరొక వ్యక్తితో లోపలికి పంపించాడు... పద్మ నన్ను కూడా రమ్మంది కాని. బాబా... "ఆ అమ్మాయిని అతను చూస్తాడు... నువ్విక్కడే వుండాలి!" అని నన్ను వెళ్ళనివ్వలేదు..... పద్మ అతని వెనకాల వెళ్ళింది... సుందరి మరి మాట్లాడకుండా వూరుకుంది...

"తర్వాత... తర్వాత... తర్వాత ఏమయింది?" అని అడిగేడు

"... అక్కడ మరెవ్వరూ లేరు:... అపుడు బాబా నా చేయి పట్టుకున్నాడు. నేనింకా...చేయి చూసి చెబుతాడు కాబోలు అనుకుంటూండగానే దగ్గిరకి వచ్చి అసహ్యంగా...." అని ఏడవడం ప్రారంభించింది.

"ఆ... రాస్కెల్... ఎంత పని చేశాడు!... యింత మోసమా?... అయ్యో! నాతల్లీ... మరేం జరగలేదు కదా..." అని తల పట్టుగున్నాడు...

"నాకు ముచ్చెమటలూ పోసినాయి... తెలివి తప్పోయినంత పని అయింది. ఎంతో భయం వేసింది- తోడెవరూ లేకపోవడంతో నాకు పాదాల నుండి వణుకు పట్టుగుంది!... యింకా ఏంచేస్తాడో? ఏమవుతుందో!... ఎలా యిక్కడి నుండి బయట పడడం భగవంతుడా! అని ఆదేవుడిని తలుచుగుంటూ ధైర్యం తెచ్చుగుని వాడిని విడిపించుగుని దూరంగా పరుగెట్టేను. పారిపోదామంటే యింతకు ముందే ఎవరో తలుపులన్నీ వేసి పోయినట్టున్నారు. అంతలో వాడు తిరిగి వచ్చి-

"అందరూ మొదట్లో యిలా అన్నవాళ్ళే - చూడూ నీకు పిల్లలు లేరనేకదా యిక్కడకు వచ్చేవు!... అది నీ లోపంకాదు... నీ భర్తది - అయినా భయం లేదు! దేవుడి వరాల వల్లా, మొక్కుల వల్లా, మంత్రాల వల్లా, ఆశీస్సుల వల్లా బాబాలూ, యోగుల వల్లా, సంతానం కలుగుతుందని... అందరికీ నమ్మకం వుంది కదా! దాని వల్ల ఎన్నో యిబ్బందులు లేకుండా పోయాయి!... ఆ నమ్మకంతోనే ఎందరో వస్తున్నారు.. మేం చెప్పింది... విని వాళ్ళ కోర్కెలు తీర్చుకువెళుతున్నారు!... యీ రహస్యం మనిద్దరిలోనే వుండి పోతుంది!... అంచేత నామాట విను!.... కాదనకు ... నీకు సంతానం కలగాలంటే నీవు ఒప్పుగోనక తప్పదు... పిల్లలు లేకపోతే... లోకంలో నువ్వెంత చులకన అయిపోతావో ఆలోచించు! జీవితాంతం! ఆ అవమానాన్ని భరిస్తూ వుండగలవా? ఎరువు సొమ్ము బరువన్నట్టు.. ఆఖరికి ఎవరినో దత్తత చేసుకుని లేని అభిమానాన్ని తెచ్చుకొని... అదే ఆశించి నిజమయిన ప్రేమని పొందలేక విఫలులౌతూ నిరాశ చెందుతున్నారు

వాడిని నమ్మి ఆస్థి పాస్తులు ధార పోస్తున్నారు. వాడూ అందు కోసమే వచ్చి అంత వరకూ తెచ్చుకున్న ప్రేమని చూపి ఆ ఆస్తి చేచిక్కగానే వేరయిపోతున్నాడు!" అంతకన్నా ఏయిబ్బందీ లేని... యీ మార్గం... మంచిదే కాదా!.. అప్పుడు నీవూ ఒక తల్లి వవుతావు... నీ కడుపు ఫలించి మాతృమూర్తి వవుతావు. మీ వంశం వృద్ధి అవుతుంది. నీకుటుంబంలో సంఘంలో నీకూ ఒక ఉన్నతస్థానం లభిస్తుంది!... యింత మాత్రంతో నీకే లోపం రాదు! నీ పాతివ్రత్యం, ఎవరి దృష్టిలోనూ చెడదు!... రెండో కంటి వాడికి తెలీదు! అందరితో పాటూ నీకు వరం లభించింది అని లోకం

అనుకుంటారు! అందరూ ఆనందిస్తారు!... నా మాట విను! యిక్కడి రహస్యాలు ఎవరికీ తెలియకుండా అన్ని కట్టు బట్లూ చేసి వున్నాయి... ఎవరికీ అనుమానం కూడ కలగదు. ఇదొక బోను లాంటిది.... ఎవరయినా లోనికి రాగలరు గాని... విడిపించుకు పోలేరు... యిలా ఎంతో మంది అయేరు!. వాళ్ళందరూ యిప్పుడు ఎంతో ఆనందంగా వున్నారు. అంతే కాకుండా ప్రతీ ఏడూ వచ్చి మొక్కు తీర్చుకుంటారు!... నామాట... విను రా!...''

అంటూ యిలా ఎన్నో అనరాని మాటలు అంటూ... బలవంతం చేయ బోయాడు!.. నేను ఊరుకోక... సత్తువంత కూడదెచ్చుకొని దూరంగా తోసాను... అయినా అతడు.. లేచి - అసహ్యంగా నోట చెప్పరాని తిట్లు తిడుతూ కోపంగా ''ఇదిగో... యిప్పుడు నువ్వు నన్ను కాదని వెళ్ళిపోయినా - నీకు నీ వారిలోనూ, లోకంలోనూ. మంత్రం వేయించుకున్నా సంతానం కలగలేదని దేవుడు దగ్గిరకి వెళ్ళినా దీనికి పిల్లలు పుట్ట లేదే అని.. దీని మొహం చూస్తే పాపం! అని... అంటారు.. నీకు గౌరవం వుండదు... అంచేత నామాట విను!.. నీ కోర్కె నెరవేర్చుగో!..'' అని మీద మీదకు రాబోయాడు!

నాకు ఒక వైపు నుండి... భయంగా వున్నా.. ఏదో ఎదురించే శక్తి నాలో ప్రవేశించి... తిరగ బడ్డాను...

''నీ గుట్టంతా బయట పెడతాను!... అందరూ... నీలాటి వారి మాటలకి లోబడతారని అనుకోకు!... యిప్పటికయినా నన్ను మర్యాదగా వదిలితే.. నీవూసే ఎత్తకుండా.. నా దారిన నేను వెళతాను....'' అని అన్నాను.

''అదా... నీ వుద్దేశ్యం... అయినా నాకేం ఫరవాలేదు.. నీలాటి ఏ ఒక్కరో అలా చెబితే... నమ్మతారను కున్నావా? లొంగిపోయిన వాళ్ళందరూ... నన్ను పొగుడుతూ, నా మహాత్యాన్ని చెప్పుగుంటూంటే - నీమాటలు ఎవరు లెక్క చేస్తారు? నన్ను ఎవరయినా అంటే వాళ్ళ గుట్టు బయట పడుతుంది. అది వాళ్ళకే నష్టం అందువల్ల ఎవరూ నన్ను అనరు!... తిరిగి నన్నే అంటారు.... యిప్పటికయినా అర్థమయిందను కుంటాను. నీ మంచి కోరే చెబుతున్నాను. యింక నన్ను బెదిరించడం మాని చెప్పినట్టు విను...'' అంటూ బలవంతం చేయబోయాడు...

నిజానికి అతనితో తలపడే శక్తి నాకు లేక పోయినా ఆ ఉద్రేకంలో ఆభగవంతుడే నాకు ఎక్కడలేని బలం యిచ్చాడను కుంటాను. వాడికి అవకాశం యివ్వకుండా పెనుగు లాడేను.. నా వంటి మీద చెయ్యి వెయ్యడానికూడా వీలుకాకండా చేసాను!... వాడు యింకానా మీదకు రావడం మానలేదు. యింక లాభం లేదని చేతి గాజులతో వాడి మొహం మీద బలంగా కొట్టేను. వాడు మొహం చేతులతో తణువుకోనేసరికి... యిక్కడా, అక్కడా అనకండా దొరికిన చోటల్లా కరవడం మొదలెట్టేను... వాడి వళ్ళంతా రక్తం. నా నోరంతా రక్తం... చాలా భయంకరంగా తయారయింది...

అక్కడితో వాడు.. మరి నాదగ్గరకు రావడం మాని.

''చాలా మంది.. వచ్చేరు.. ఎవరో నీలాటి వాళ్ళు.. మొదట కాదన్నా చెప్పిన మాట విన్నారు... లేదా.. వచ్చిన దారిని వెళ్ళేరు.. కాని... నీలా యింత ఎదిరించిన వాళ్ళని చూడ లేదు... సమాజంలో

ఎత్తి పొడుపులు, హేళన భరించలేక లొంగి పోయిన వాళ్ళే ఎక్కువ... సరే అయిందేదో అయింది. యిది మోసమే అనుకో! దుర్మార్గమే అనుకో,.. మనుష్యుల్లోని, అనువుని కని బెట్టి, ఆ అవకాశాన్ని యిలా వినియోగించుకొంటున్నాం... మా గుట్టు రట్టు చేయకు... నేను, నావల్ల ఎందరో యీ పేరు చెప్పుకొని బ్రతుకుతున్నాం... ఇది బయట పొక్కితే మా బ్రతుకులు నాశనం అవుతాయి... అందుచేత యీ రహశ్యం ఎవరితో నీ చెప్పనని మాటయిచ్చి వెళ్లు.. యింత వరకూ అయినదానికి క్షమించు.'' అని ప్రాధేయ పడడం మొదలెట్టాడు.

అంత సునాయాసంగా వాడంతలా దిగజారిపోయి, బ్రతిమాలడం నాకు ఆశ్చర్యం వేసింది ... అప్పటికి నాకు పూర్తి ధైర్యం వచ్చింది:....

''నీ దగ్గరికి వస్తున్న వాళ్లందరూ- వాళ్ల మనసారా యిష్టపడి వచ్చేవాళ్లు కాదని గుర్తుంచుకో! ఆ అభాగ్యులందరూ.. వాళ్ల బంధువుల ప్రేరేపణ వల్లో. లోకుల మాటల వల్లో. యింక సహించలేక.. వచ్చేవాళ్లు, పిల్లలు కావాలని లేకపోయినా.. బంధువులు బాధపడలేక.. వస్తున్నారు! వచ్చేక యీ సంగతి తెలిసి... కాదని పోతే.. మరింత లోకువయి పోతారని, యీ అక్రమాన్ని భరిస్తూ నోరు మూసుకొని వెళ్లి పోతున్నారు! ఇష్టం వున్న వాళ్లయితే, భర్తలని మోసం చేసి, వారాలకొద్ది, నెలలు కొద్ది, ఉపదేశాలంటూ, మంత్రాలంటూ వుంటున్నారు!

అందితే జుత్తు అందకుంటే కాళ్లూ పట్టుకొంటున్నావు తలొగ్గితే సరిసరి. లొంగకుంటే... యిలా కాళ్లమీద పడి, బ్రతిమలాడి. నీ రహస్యం బయటపడకుండా చేసుకుంటున్నావు! యిలా యింతమంది అమాయకుల శీలాన్ని బలిగొంటున్న నీకు నిష్కృతి లేదు. వాళ్లందరి ఉసురూ నీకు తగలక పోదు!.. యీ పాపానికి కారణం నువ్వు. భర్తల వల్ల సుఖపడలేదని అందుకే నీ వద్దకు వస్తున్నారని.. అనుకొంటున్నావు కదూ! అందుకే నీ నోటికొచ్చినట్టు వాగుతున్నావు! నీ అంత మూర్ఖుడు మరొకడు లేడు.. యీ విష వలయంలో చిక్కుకొని నీ అక్రమానికి బలి అయిపోయి. అవమానంతో చెప్పుకోలేక, పరువు కాపాడుకుందికి యిలా మూగగా భరిస్తున్నారు... అంతేగాని నీమీద భక్తితో కాదు. భయంతో .. లోకానికి వెరిచి. లోలోపలే పైకి చెప్పుకోలేక కృంగిపోతున్నారు..

నా సంగతి చూడు! నాకు వివాహం అయి అయిదేళ్లయింది! నాకు యింకా సంతానం కలుగలేదు- నాకుగాని నా భర్తకుగాని.. యీ విషయంలో విచారం లేదు; సరికదా.. యింకా కొన్నాళ్లు.. గడువుదామని అనుకుంటున్నాం.. కాని.. మా వాళ్లున్నారే.. వీళ్లు.. మమ్మల్ని బ్రతకనివ్వడం లేదు;.. నీలాంటి వాళ్లని నమ్మి.. యిక్కడకు తీసుకు వచ్చారు.. పోనీ యింత మాత్రంలో ఏమయింది అని వచ్చేను. కాని యిక్కడ మేక, పులిని శరణు వేడుకున్నట్టు అయింది; పులిబోనులోకి తెచ్చి వదిలారు... అయిదేళ్లలో పిల్లలు కలగకపోవడం ఒక పెద్ద దోషం కాదని వాళ్లకు తెలియదు..

ఏదయినా లోపం వుంటే- చికిత్స చేయించుకోవాలిగాని యీ వక్రమార్గాల వల్ల జరుగదని తెలియని వాళ్ల అమాయకత్వం వల్లే మీ ఆటలు సాగుతున్నాయి.. యిదేమి? త్రేత యుగమా? ద్వాపర యుగమా? యోగశక్తి వల్లా, మహా ఋషుల తపోశక్తి వల్లా జరగడానికి! అదీ కథయిగ చెప్పుకుందికే గాని నమ్మ శక్యం కాదు. ఒకవేళ జరిగినా అప్పటి కాలం వేరు, ఆ నమ్మకంతో యిప్పుడూ ప్రజలు

నిజమేనని విశ్వసిస్తున్నారు! ఆ బలహీనతని మీరు మీ స్వార్థానికి వుపయోగించుకుంటున్నారు!

అయినా మిమ్మల్ని అనవలసిన పని లేదు! - తెలివితేటలూ విచక్షణా జ్ఞానమూ, చదువు అన్నీ వుండి కూడా యీ మూఢ నమ్మకాలను నిజమని నమ్ముతున్న మాది తప్పు. గుడ్డిగా మీలాంటి వాళ్ల చేతుల్లో పెడుతున్న.. మా వాళ్లది తప్పు!.. మాలో మాకు నమ్మకం వుంటే. ఈ విషయం జరిగివుండేవి కావు! అయినా సరే మీరీ పాపం నుండి తప్పించుకోలేరు!.. బ్రతుకుతెరువుకి యిలా మోసం చేసి బ్రతకనవసరం లేదు.. యింకా ఎన్నో ఉన్నత మార్గాలున్నాయి- యిప్పటికయినా యీ తెరవెనక భాగోతాన్ని మాని మంచి మార్గంలో నడిస్తే భగవంతుడు క్షమిస్తాడు!.. '' అని ఉద్రేకంతో నాకు తోచినవన్నీ గబగబ అనేసాను.

అన్నీ వింటూ అలా నిలుచున్నాడే గాని - వాడిలో ఎక్కడా పరివర్తనగాని, సంచలనంగాని రాలేదు నేచెప్పింది అర్థం చేసుకొని పశ్చాత్తాప పడినట్లు కూడా అనిపించలేదు! పాపాలన్నీ కరిగించి పోసిన విగ్రహంలా నిలబడి వుండిపోయాడు...,

ఇంతలో నా అదృష్టం కొద్దీ పిలిచినట్టు.. తలుపు తీసేరు... ఎవరో. వచ్చినట్టు వున్నారు.. యింక అక్కడ ఒక్క క్షణం కూడా వుండకుండా పరుగున యివతలికి వచ్చేసాను!

ఆ వచ్చింది... ఎవరో కాదు. పద్మని తీసుకువెళ్లిన వ్యక్తి... పద్మని అక్కడికి తీసుకువచ్చి-లోనికి వచ్చాడు....

నా పరిస్థితి వల్ల అంతవరకూ పద్మ సంగతి జ్ఞప్తికి రాలేదు... ఏడుస్తూ అక్కడ నిలుచొని వున్న పద్మని చూసి.. ఆమెకు కూడా యిలాటి అనుభవమే అయివుంటుందని.. వూహించి... అంత అయోమయ పరిస్థితిలోను ఆమె దగ్గరకు పోయి ''ఏమయిందని'' దగ్గరికి తీసుకొని అడిగేను..

ఇద్దరం ఒకే పరిస్థితిలో వున్నా.. ఆ చిన్న పిల్లని, అభం శుభం తెలియని పిల్లని ఓదార్చడం నా వంతు అయింది!...

''పుణ్యానికి పోతే పాపం; వచ్చినట్టు.. ఏదో మనం వస్తున్నాం కదా అని మనతో పంపారు పద్మని... అయ్యో పద్మా.. ఊరుకో అమ్మా... ఏడవకు.. ముందుగా మా వాడు చెబుతున్నా వినకుండా.. వచ్చాం.. మనదే తప్పు... చెప్పమ్మా నిన్నేం అనలేదు కదా...'' అని ఆ అమ్మాయికి ధైర్యం చెప్పి అడిగాడు మావయ్య!

''... నన్నలా తీసుకుపోయి.. నన్నోగదిలో.. వదిలి... వాడు వెళ్లిపోయాడు... వెళ్లగానే.. నా ఎదురుగుండా కనబడిన దృశ్యం చూసి నాకు మతి పోయింది.. అక్కడ ఒక దుర్మార్గుడు.. ఒక స్త్రీని బలవంతం చేస్తున్నాడు.. ఆమె.. వదుల్చుకోడానికి గింజుకుంటూ వుంటే.. ఆమె ముక్కు దగ్గిర ఏదో వాసన చూపెడుతున్నాడు.... యీ పనిలో... అతడు.. నన్ను గమనించలేదు... ఆమె తలగట్టిగా పట్టుకొని ముక్కు మీద గట్టిగా ఆమందు రుమాలును అదిమిపెట్టాడు.. కొద్దిసేపటికి ఆమె తెలివి తప్పిపోయింది... అది చూసి నేను భయంతో వెనక్కి తిరిగి.. తలుపు తెరిచి పారిపోబోయేను.. కాని తలుపు వేసి వుంది.. గట్టిగా తలుపులు బాదేను...

ఆ చప్పుడు విని.. అతడు నన్ను చూశాడు... .. తెలివి తప్పిన స్త్రీని అలాగే వదిలి

నావైపువచ్చి... నన్ను మరోగదిలోకి లాక్కొని వెళ్లాడు... నేను విదిలించుకొంటూ వుంటే...

''ఫరవాలేదు.. భయపడకు... అల్లరి చేయకుండా నే చెప్పింది వింటే...సరి... లేదా ... చూశావు కదా ! దానికి పట్టినగతి... అలాగే.... నిన్నూ చేసి....'' అంటూ నన్ను... దగ్గరిగా తీసుకుని... ఏదో చేయబోయాడు..... అని మరి చెప్పలేక ... సిగ్గుపడి వూరుకుంది పద్మ.

''తర్వాత... తర్వాత ఏమయింది !'' అని అడిగాడు మావయ్య. ఆమె తలదించుకొనే -

''అయినా సరే ... నేను కాస్త ధైర్యం తెచ్చుకుని ఎదిరిస్తూ... వాడిని తిట్టిపోస్తూ... నన్ను వదిలేయమని - అరిచేను... కాని వాడు వదలలేదు... నేను యింకా లొంగకుండా ఎదురుతిరిగేసరికి... మరి లాభం లేదనుకున్నాడో ఏమో ....గట్టిగా నన్ను పట్టుగొని మంచం మీదకు ...తోసి... ఆ మందు రుమాలును నాకు వాసన చూపెట్టడానికి... ప్రయత్నించాడు...నేను మరి అతనితో సాధలేక... అతడు చేయబోయే పనిని చూశాను కాబట్టి - ఊపిరి ... బిగబెట్టి... తెలివి తప్పిపోయినట్టు పడి కదలకుండ వుండిపోయాను! .... అపుడతను... నా మీద పడి... అసహ్యంగా ప్రవర్తించబోతే... నేను నా బలం అంతా కూడదీసుకొని కాలితో ఒక్క తాపు తన్నేను... ఆ తర్వాత... ఆకోపంతో ఏం చేస్తాడో అన్న భయంతో కళ్లు మూసుకున్నాను... కాని అబ్బా! అన్న కేక వినిపించి చూశాను... నే తన్నిన దెబ్బ ఎక్కడ తగిలిందో ఏమోగాని.... వాడు... పొత్తి కడుపుని పట్టుగొని... గిలగిల లాడిపోతున్నాడు... అదే సమయం అనుకొని... నేను... ఆ గదిలో నుండి బయటకు వెళ్లే తలుపు తెరుచుకొని ... వచ్చేస్తూంటే... వాడు ఆ బాధతో మూలుగుతూనే నన్ను పట్టుగొని... కొడుతూ యీడ్చుకుంటూ తీసుకువచ్చి... అక్కడ వదిలి.... తను .... లోపలికి వెళ్లేడు...'' అని పద్మ తన అనుభవం చెప్పింది!.

ఆ తర్వాత యిద్దరూ ... ఏడుస్తూ కూర్చున్నారు!...

''ఇదా... అక్కడ జరుగుతున్న ....కుంభకోణం! ... ఎంత అన్యాయం ! ఎంత దుర్మార్గం ! ... యిన్నాళ్లబట్టీ జరుగుతున్నా ... ఎవరూ పట్టించుకోలేదా ? ... వాళ్ల సంగతి ... చూస్తాను !... వాళ్ల అంతు తేలుస్తాను... యీ బాబా గారి అసలు సంగతి .... బయట పెడతాను.... !'' అంటూ వుద్రేకంతో... వూగిపోతున్నాడు.

''అయిందేదో అయింది.... అన్నీ తెలిసిన మనమే యిలా మోసపోడం మన తప్పు ! ... ఏం చేయాలో రేపు ఆలోచిద్దాం... విశ్రాంతి తీసుకోండి !'' అని చెప్పి... సుందరి - పద్మలకి కూడా ధైర్యం చెప్పేను.....

ఆ రాత్రి.... ఎవరికీ నిద్ర పట్టలేదు. జరిగిన సంగతులు మరిచిపోదామన్నా... మరుపలేకుండ వున్నాయి....

ఆ మర్నాడు... ఇద్దరం వెళ్లి పోలీసు రిపోర్టు యిచ్చాం.... వాళ్లు యక్ష ప్రశ్నలు వేశారు... రుజువు సాక్ష్యం లేనిదే... ఏం చేయగలరు ? అని అడిగారు.

ఆ సంగతి తరవాత చూద్దాం ముందు కేసు బుక్ చేయండి అని అడిగి మేము రిపోర్టు వ్రాసి యిచ్చి వచ్చాం!...

అంతే.... దానికి అతీ గతీ... యిప్పటి వరకూ లేదు... తర్వాత అడిగితే తగిన సాక్ష్యాధారాలు

దొరకలేదు.... అంచేత ఆకేసు క్లోజ్ చేశాం... అని జవాబు చెప్పేరు!....

అన్యాయాన్ని బయట పెట్టి యిలాటి వాళ్ళ నిజ స్వరూపాలని ప్రజల ముందుంచి యీ మోసాలనూ, అక్రమాలనూ అంత మొందించాలని ఏ ఒకరిద్దరిరో యిలా ధైర్యం చేస్తే జరిగేది యిది.. చాలా వుంది.... అసలు విషయం చెబితే తమ పరువు, వంశగౌరవం ఎక్కడ పోతుందో అని- నిజాన్ని దాచి యీ రహస్యాన్ని సాక్ష్యం లేకుండా తమలోనే జీర్ణించుకొని... నోరు మూసుకు పూరుకుంటున్నారు.... పైగా బాబా గారిని... దేవుడని... మహాత్ముడని... లోకం అంతా పొగడుతూంది! అక్రమాలూ, అన్యాయాలూ సహజంగా జరిగిపోతున్నాయి...

ఇలా ఎక్కడ రహస్యాలక్కడే మురిగి పోతూంటే జరగక ఏమవుతాయి?

దీని వల్ల జాతి గౌరవం, దేశ గౌరవం... ఎంత దిగజారిపోతున్నదో ఎవరు పట్టించుకుంటున్నారు? ఇది ఎంత నీచ స్థితికి దిగజారుతుంది?

మంత్రాలకు చింతకాయలు రాలతాయా?

ఆశీర్వచనాలకు కోరికలు నెరవేరుతాయా?

మూఢ నమ్మకాలతో ముక్తి కలుగుతుందా?

ఇందులో నిజాలు ప్రజలు తెలుసుకొనే వరకూ యీ మోసాలు యిలా సాగుతూనే వుంటాయి

ఇదొక సాధారణంగా జరిగే విషయం.... అంతే...రోజూ జరిగే వాటిల్లో అదొకటి! యీ సంఘటన వల్ల బాబాగారికేమీ నష్టం కలుగలేదు!.... అలాటి వెన్నో! ఆ గోడల మధ్య మూగబోయినాయి...

అక్కడ ప్రతిధ్వనించేది... బాబాగారు! దైవస్వరూపులు! కోరికలు తీర్చే కామధేనువు! ఆపద్బాంధవుడు.... యివే మాటలు! యివే నమ్మకాలు!

బాబాగారి ఆశ్రమం... నిత్యం కళకళలాడుతూనే వుంటుంది.

భక్తులు తండోప తండాలుగా వస్తూపోతూనే వుంటారు! సేవలు చేస్తూనే వుంటారు! వరాలు పొందుతూనే వుంటారు! కోరికలు తీర్చుకుంటూనే వుంటారు!

అంతా యధాప్రకారం... జరుగుతూనే వుంటుంది.

''సత్యం వధ'' (సత్యం వధించబడింది)

''ధర్మం చెర'' (ధర్మం చెరలో వుంది)

ఇదే ఈ యుగ ధర్మం...

★ ★ ★

(అముద్రితం)